క్లుప్తంగా

రిటైర్డ్ హెచ్‌ఎంకు విద్యారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు రాష్ట్రస్థాయి విద్యారత్న అవార్డు లభించింది. ఈనెల 5న పెద్దపల్లి జిల్లాలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో బిట్-బిట్ డ్యాన్స్ అకాడమీ-దేవా కళా బృందం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందజేశారు. విద్యారంగంలో విశేష సేవలు అందించిన రిటైర్డ్ హెచ్ఎం డాక్టర్ వెంకటేశ్వరరావును అతిథులు, నిర్వాహకులు సన్మానించి, అవార్డు అందజేసి, నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు ఆదివారం ఈ విషయాన్ని స్థానిక విలేకరులకు తెలిపారు.

సీపీఐలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం)/సుజాతనగర్: కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలం కోమటిపల్లి ఎంపీటీసీ మూడు గణేష్, మాజీ సర్పంచ్ మంగమ్మతోపాటు మరో 60 కుటుంబాలు ఆదివారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో సీపీఐలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి, వారికి సభ్యత్వం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నామని, వాటిని చూసి నియోజకవర్గంలో వివిధ పార్టీల నుంచి సీపీఐలో చేరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, చంద్రగిరి శ్రీనివాస్‌రావు, సలిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రూట్ మార్చ్



రూట్ మార్చ్ నిర్వహిస్తున్న కార్యకర్తలు

పాల్వంచరూరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ నిర్మాత డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్ 135వ జయంతి సందర్భంగా పాల్వంచ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో పద సంచలనం రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రదర్శనలో రెండువందల మంది గణష్ వేషధారి స్వయంసేవకులు పాల్గొన్నారు. భజన మందిరం నుంచి ప్రారంభమైన మార్చ్ బస్టాండ్ అంబేద్కర్‌సెంటర్ శాస్త్రీరోడ్డు మీదుగా తిరిగి రామాలయం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ శ్రీరామ్ మల్లికార్జున్, జిల్లా సంఘచాలక్ మేదరమెట్ల పార్థసారధి, ఆకుల ఆనంద్, దేవేంద్ర, ప్రతాప్, భీమల్‌జైన్‌కుమార్, పవన్‌కల్యాణ్, సదాశివ పావని, భవానీ పాల్గొన్నారు.

ఘనంగా ఇలవేల్పుల పండుగ



అందుగులబోడులో ఇలవేల్పును వనం నుంచి తీసుకొస్తున్న తలపతులు

ఇల్లెందురూరల్: ఆదివాసీలు ఏటా వేల్పుల పండుగను మాఘమాసం నుంచి చైత్రమాసం వరకు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఇలవేల్పుల జాతరలు ఘనంగా జరుగుతున్నాయి. అందుగులబోడు గ్రామంలో పూనెం వంశస్థుల, నిజాంపేట గ్రామంలో వర్స వంశస్తులు గుడిమల్లు జాతరను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున వనం నుంచి ఇలవేల్పులను భారీ ఊరేగింపుతో ఆలయం వద్దకు చేర్చిన తలపతులు ప్రత్యేక పూజ చేశారు. అనంతరం ఆయా గ్రామాలలో చరిత్ర కలిగిన ఇలవేల్పులను స్మరించుకుంటూ డోలు వాయిద్యాలతో వారి వీరగాథలను రేలా పాటలతో వివరించారు.

రేషన్ కోసం ఎదురుచూపు

- సమయపాలన పాటించని డీలర్లు, జీసీసీ సేల్స్‌మెన్లు
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు



కిన్నెరసాని జీసీసీ సేల్స్ డిపో వద్ద నిరీక్షిస్తున్న వినియోగదారులు

పాల్వంచరూరల్: ఏజెన్సీ గ్రామాల్లో రేషన్ డీలర్లు సమయపాలన పాటించకపోవడంతో రేషన్ బియ్యం కోసం తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రతీనెల 1వ తేదీన రేషన్‌షాపు తెరిచి బియ్యం పంపిణీ చేయాల్సిన డీలర్లు, సేల్స్‌మెన్లు ఇష్టం వచ్చిన సమయంలో పంపిణీ చేయడం వలన రేషన్ సక్రమంగా తీసుకోలేక బియ్యం పక్కదారి పడుతున్నాయని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 19 రేషన్ దుకాణాలున్నాయి. 11 జీసీసీ సేల్స్ డిపోలు ఉండగా ఇందులో 28,658 ఫుడ్ సెక్యూరిటీ, 2,147 అంత్యోదయ, 26,511 ఎఫ్ఎస్‌సీ కార్డులు ఉన్నాయి.

ఊరు ఒకచోట.. రేషన్ షాపు మరోచోట...

ఊరు ఒకచోట ఉంటే రేషన్ షాపు మరో ఊర్లో ఉండటంతో వర్షాకాలంలో రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా మారింది. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని యానంబైల్ గ్రామంలో ఉండాల్సిన రేషన్ దుకాణాన్ని కిన్నెరసానిలో ఏర్పాటు చేశారు. దీంతో నిరుపేదలు రేషన్ తెచ్చుకోవాలంటే ప్రతీనెల అవస్థలు పడుతున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో కిన్నెరసాని గేట్లు ఎత్తితే ఊరు దాటలేని పరిస్థితి. అదేవిధంగా బంద్రుగొండ గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయకపోవడం వలన ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న దంతలబోరు గ్రామానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవాలి. వర్షాలకు ముర్రేడు వాగు వరద దంతలబోరు వైపు వెళ్లే మార్గంలో పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోతాయి. నాగారం గ్రామంలో రేషన్ షాపు ఉంటే దానికి రెండు కిలోమీటర్ల దూరంలో బోజ్యా తండా ఉంది. పాండురంగాపురంలో రేషన్ దుకాణంలో దానికి ఐదు కిలోమీటర్ల దూరంలో నర్సంపేట, తవిశలగూడెం గ్రామాలు ఉన్నాయి. రేగులగూడెంలో జీసీసీ సేల్స్ డిపో ఉంటే దానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో మామిడిగూడెం, రాళ్లచెలక, చంద్రాలగూడెం గ్రామాలు ఉన్నాయి. కోడిపుంజుల వాగులో రేషన్‌షాపు ఉంటే దానికి కిలోమీటరు దూరంలో పుల్లాయిగూడెం, పూసల తండా, దేవిజ్యాతండా, సూర్యాతండా ఉన్నాయి. కారెగట్టులో రేషన్‌షాపు ఉంటే దానికి మూడు కిలోమీటర్ల దూరంలో సత్యనారాయణపురం, సారెకల్లు గ్రామాలు ఉన్నాయి. మరికొన్ని కార్డులు కిన్నెరసాని జీసీసీ సేల్ డిపో పరిధిలో ఉన్నాయి. ఉల్వనూరులో జీసీసీ సేల్స్ డిపో ఉంటే దానికి రెండు కిలోమీటర్ల పరిధిలో కొత్తూరు, గంగదేవిగుప్ప, లక్ష్మీదేవిపల్లిలో రేషన్‌షాపు ఉంటే రెండు కిలోమీటర్ల పరిధిలో నర్సింహాసాగర్ గ్రామం ఉంది. రేషన్ షాపులు స్థానికంగా లేక ప్రతీనెల లబ్ధిదారులు పనులు మానుకుని రేషన్ షాపు వద్ద నిరీక్షిస్తూ అవస్థలు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.



దంతలబోరులో రేషన్ పంపిణీ

ఒకే డీలర్‌కు రెండుషాపులు...

అసలే సమయపాలన పాటించక సకాలంలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ కావడం లేదంటే దీనికితోడు ఒకే డీలర్‌కు రెండుషాపుల చొప్పున కేటాయించడంతో నిర్దేశించిన సమయానికి రేషన్ షాపును తెరవడం లేదు. పాండురంగాపురంలో రేషన్ డీలర్ బస్వతారక కాలనీ రేషన్‌షాపును అదనంగా కేటాయించారు. దంతలబోరులోని జీసీసీ సేల్స్‌మెన్‌కు బంద్రుగొండ షాపును, ఉల్వనూరు సేల్స్‌మెన్‌కు మల్లారం షాపులను అదనంగా కేటాయించడంతో రెండు చోట్లా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

డీలర్లను నియమించాలి..



మండలంలో ఒక డీలర్‌కు రెండుషాపులను కేటాయించడం వలన లబ్ధిదారులకు సకాలంలో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదు. అధికారులు స్పందించి వెంటనే ఖాళీగా ఉన్న రేషన్ షాపుకు డీలర్‌ను నియమించాలి. – నిమ్మల రాంబాబు

సమయపాలన పాటించాలి..



రేషన్ దుకాణం డీలర్లు సమయపాలన పాటించకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ప్రతీనెల సమయానికి షాపులను తెరిచి పంపిణీ చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. – పద్దం లక్ష్మి

ప్రతిపాదనలు పంపించాం..



ఖాళీగా ఉన్న రేషన్ షాపు డీలర్ల భర్తీ కోసం ప్రతిపాదనలు పంపించాము. అన్ని షాపుల్లో సమయపాలన పాటించని డీలర్లపై చర్యలు తీసుకుంటాం. పై అధికారుల నుంచి ఆదేశాల ప్రకారం భర్తీ చేస్తాం. – వివేక్, పాల్వంచ, తహసీల్దార్

పేదలకు సహకారం అందించండి..

ఇల్లెందు: సమాజంలో అన్నివర్గాలతో పాటు ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు.

ఆదివారం పట్టణ, మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు అర్వపల్లి, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు పదవీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం శ్రీ కన్యకాపరమేశ్వరీ సత్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని నూతన అధ్యక్షులను అభినందించారు. రానున్న కాలంలో అందరిని సమీకరించి సంఘం బతోపేతం కోసం పాటుపడాలని, పేదలకు సంఘం సహాయ సహకారాలు అందించి వారి పురోభివృద్ధికి పాటు పడాలని కోరారు. వర్గవిభేధాలకు తావు లేకుండా సంఘాలన్నీ ఏకతాటి మీదకు తీసుకొచ్చి అందరిని మెప్పించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

చెక్ డ్యాం పనులు నిలిపివేయాలని ఆందోళన



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న రైతులు

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ చీపురుగూడెం గ్రామ సమీపంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రైతులు ఆందోళన నిర్వహించారు. చెక్ డ్యాం నిర్మాణంతో పంట పొలాలు కోల్పోతున్నామని, పరిసర రైతుల అంగీకారం లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నారని, మరో ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మించాలంటూ శనివారం రైతులు పనులను అడ్డుకోవడంతో నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్ మళ్లీ ఆదివారం తిరిగి ప్రారంభించారు. దీంతో బాధిత రైతులు మళ్లీ ఆందోళనకు దిగారు. ఇరిగేషన్ అధికారులు ఎలాంటి సర్వే చేపట్టకుండా రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా చెక్ డ్యాం నిర్మిస్తుండటంతో భూములు కోల్పోవాల్సి వస్తోందని, వానాకాలంలో వచ్చే వరద ఉధృతికి పంటలు దెబ్బతినడంతోపాటు, పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు రాకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు నిలిపివేయాలని రైతులు పట్టుబట్టడంతో గత్యంతరం లేక సూపర్‌వైజర్ పనులు నిలిపి వేశాడు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించనున్నట్లు బాధిత రైతులు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఇల్లెందు(టేకులపల్లి): మద్దిశెట్టి సామ్యేల్‌పై పెట్టిన అక్రమ కేసుని ఎత్తివేయాలని, గిరిజనులపై దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని భారతీయ సర్వ సమాజ్ మహా సంఘ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈసం నాగలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండల అధ్యక్షుడు సూరె సీతారాములు, నేత పడిగ ఎర్రయ్య ఆధ్వర్యంలో కొప్పురాయి పంచాయతీ ఇప్పలచెలక గ్రామంలో నిరసన తెలియజేశారు. మాట్లాడుతూ... సత్తుపల్లి పోడు భూముల ఘర్షణ విషయంలో పోలీసులు సామ్యేలు ఇంటి వద్ద లేని సమయం చూసి గిరిజనులపై విచక్షణా రహితంగా, మహిళలపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సంఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కేసులు ఎత్తివేయాలని, పోడుభూముల సమస్య పరిష్కరించాలని లేదంటే సీఐ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఇప్పలచెలకలో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి

పాల్వంచరూరల్: మండల పరిధి జగన్నాథపురంలోని రామాలయం సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున్న ప్రయాణికులకు, భక్తులకు చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, కార్యదర్శులు సాయిరాం, రవి, రాంబాబు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా

ఇల్లెందు(టేకులపల్లి): శంభునిగూడెం, మేళ్లమడుగు, గంగారం, మద్రాస్‌తండా, మద్దిరాలతండా, కిష్టారం, లచ్చగూడెం, కేటీసీ తదితర ప్రాంతాల నుంచి ప్రతీరోజు ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీంతో రాత్రివేళ ఆయా గ్రామాల్లో ప్రజలు ట్రాక్టర్ల మోత భరించలేకపోతున్నారు. సాయంత్రం నుంచి తెల్లవారు జాము వరకు ట్రాక్టర్ల రణగొణధ్వనులతో ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అక్రమ రవాణాకు ఆగకపోవడం గమనార్హం.



బేతంపూడిలో ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాల్వంచరూరల్: మండలంలోని 11కేవీ కరకవాగు, యానంబైల్ ఫీడర్ మీద గల ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ లైన్‌లో సోమవారం మరమ్మతులు నిర్వహిస్తున్నందున్న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిన్నెరసాని, కోడిపుంజులవాగు, పుల్లాయిగూడెం, పునుకుల, బంజర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సమావేశం ఏర్పాటు చేసిన కొత్తగూడెం నియోజకవర్గ ప్రజాప్రతినిధిపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ గత నెల 23న నియోజకవర్గ ప్రజాప్రతినిధి, వారి పార్టీ శ్రేణులు ఎన్నికల నిబంధనలను అతిక్రమించి పాల్వంచ మండలం తోగ్గూడెం, జగన్నాథపురం గ్రామాల్లో అనుమతులు లేకుండా ఎన్నికల కోడ్‌ను అతిక్రమించి సమావేశాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఫిర్యాదు చేసినా విచారణ పేరిట కాలయాపన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సందెల సందీప్, తాటిపాముల హరికృష్ణ, ధనుంజయ్, నన్ను తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ సంఘం ఎన్నిక



మాట్లాడుతున్న కొత్త అధ్యక్షుడు రాజేష్

చుంచుపల్లి: తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మల్లవరపు రాజేష్, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రామారావు, శ్రీనివాస్, ఆంజనేయులు వ్యవహరించారు.

మోదీ పాలనకు చరమగీతం పాడుదాం..



మాట్లాడుతున్న భాస్కర్

సింగరేణి(కొత్తగూడెం): దేశంలో మోదీ నియంత పాలనకు చరమగీతం పాడుదామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కే.భాస్కర్, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు ఆరెల్లి మురళీ అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ నియంతృత్వ ధోరణితో మతతత్వాన్ని పెంచి పోషిస్తూ ప్రజల మధ్య మత విభజన రేఖను గీస్తోందని బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని పెంచి పోషిస్తూ దళితులపై, గిరిజనులపై దాడులు జరిగినా మౌనంగా ఉంటూ.. ప్రభుత్వరంగాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించి కార్పొరేట్ శక్తులను పెంచి ప్రోత్సహిస్తోందని, కార్మిక, రైతు చట్టాలను సవరిస్తూ లేబర్ కోడ్‌ను తీసుకొచ్చి కార్మికులకు, రైతాంగాలను బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య వాదులను విప్లవ శక్తులను జైల్లో నిర్బంధించి ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తోందన్నారు. రాజకీయ పక్షాలుగా ప్రతిపక్ష హోదాలో ఉన్న పార్టీలపై ఈడీలను ప్రయోగిస్తూ ప్రతిపక్షం లేకుండా చేయాలని చూస్తోందని ఇది పార్లమెంటరీ నియంతృత్వానికి దర్పణం పడుతుందన్నారు.

నేడు సుజాతనగర్ ఎంపీపీ ఎన్నిక

సుజాతనగర్: మండల పరిషత్ అధ్యక్ష పదవి (ఎంపీపీ) ఎన్నిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నారు. 2019లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో సింగభూపాలెం ఎంపీటీసీగా గెలుపొందిన భూక్యా విజయలక్ష్మి ఎంపీపీగా ఎన్నికయ్యారు. అప్పట్లో భూక్యా విజయలక్ష్మి, బానోత్ అనిత(వైస్ ఎంపీపీ) చెరో రెండున్నరేళ్ళు ఎంపీపీగా ఉండాలని అప్పటి ప్రజాప్రతినిధుల సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రకారం 2022 ఏప్రిల్ నాటికే వైస్ ఎంపీపీ అనిత ఎంపీపీ కావాల్సి ఉంది. ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. హామీ మేరకు ఎంపీపీ పదవి తనకు ఇవ్వాలంటూ బానోత్ అనిత రెండున్నరేళ్లుగా డిమాండ్ చేస్తోంది. కానీ విజయలక్ష్మి ఎంపీపీ కుర్చీ వదిలేది లేదని భీష్మించుకుంది. దీంతో అవిశ్వాసంతోనైనా ఎంపీపీ పదవిని దక్కించుకోవాలని పలువురు ఎంపీటీసీల మద్దతుతో అనిత ఆర్డీఓకు ఫిర్యాదు చేసింది. అనంతరం ఆర్డీఓ సమక్షంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా మెజార్టీ సభ్యులు ఎంపీపీ విజయలక్ష్మికి వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే నేడు అధికారికంగా జరిగే ఎంపీపీ ఎన్నికల్లో ఆ పదవి ఎవరిని వరిస్తుందనేది హాట్ టాపిక్‌గా మారింది. నియోజకవర్గంలో కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సీపీఐ పవర్‌లో ఉంది. ఇదే పార్టీకి చెందిన మహిళ ఎంపీటీసీ సైతం ఎంపీపీ పదవి కోసం పావులు కదుపుతున్నట్లుగా సమాచారం. బీఆర్‌ఎస్, సీపీఐ పార్టీలతో పాటు, వైస్ ఎంపీపీ అనిత సైతం పదవిని దక్కించుకోవాలని చూస్తోంది. మెజార్టీ సభ్యులు ఎవరిని బలపరుస్తారా అనేది నేడు తేలనుంది.

బీజేపీ హటావో – దేశ్‌కీ బచావో



మాట్లాడుతున్న చాంద్‌పాషా

జూలూరుపాడు: విద్యార్థులు, యువతను విస్మరించిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో జరిగిన ఏఐవైఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికల హామీలను అమలు పరచడంలో విఫలమైందన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మరిచిందన్నారు.

తెలంగాణ విభజన హామీలు, విద్యాసంస్థలను కేటాయించకుండా ప్రధాని మోదీ కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని తెచ్చిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హటావో-దేశ్‌కీ బచావో అనే నినాదంతో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి విద్యార్థులు, యువత సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి పవన్, కొండా హనుమంతరావు, బడుగు మౌళి, నాగయ్య, సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో పనివేళలు మార్చండి

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. సింగరేణి కోల్ బెల్ట్ ప్రాంతంలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పనివేళలు మార్పు చేయాలని ప్రగతిశీల కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్‌షావలీ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...

రాష్ట్రంలో ఎండలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ శాఖ కార్మికుల పనివేళలు మార్పు చేసిందని, సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎండకు సొమ్మసిల్లి పోతున్నట్లు చెప్పారు. వెంటనే సింగరేణి అధికారులు కాంట్రాక్ట్ కార్మికులు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే కార్మికులకు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీకి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు కార్మికులకు పనివేళలు మార్పు చేయాలని, సీఎంపీఎఫ్ లెక్కలు చూపించాలని, తక్కువ వేతనంతో పనిచేస్తున్న కార్మికులకు ముఖ్య అవసరాలకు సీఎంపీఎఫ్ డబ్బులు వాడుకునే అవకాశం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కల్పించాలని కోరారు. అదేవిధంగా మూడేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు చూపించటం లేదన్నారు. ఈ సమస్యల పట్ల యాజమాన్యం సానుకూలంగా ఆలోచించాలని కోరారు.

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల పనివేళల్లో మార్పు చేయాలని ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు మండుతున్నందున గ్రామపంచాయతీలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్మికులకు విరామం ఇవ్వాలని కోరారు. అత్యవసరమైతే నీడపట్టున ఉన్న పనులకు మాత్రమే పురమాయించాలని విజ్ఞప్తి చేశారు.

రంజాన్ కానుకల పంపిణీ



ఇల్లెందు: దుస్తులు అందజేస్తున్న గౌస్, జానీ



సూపర్‌బజార్(కొత్తగూడెం): కానుకలు అందజేస్తున్న డ్రైవర్లు

ఇల్లెందు: రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని ప్రముఖ కూరగాయల వ్యాపారులు ఎస్‌కే గౌస్, జానీ, ఖాజాలు ఆదివారం పేద మహిళలకు నూతన దుస్తులు, రంజాన్ పండుగ దినుసులు పంపిణీ చేశారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. యూనియన్ జిల్లా సలహాదారులు గిరి, ప్రశాంత్‌ల సౌజన్యంతో అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ధర్మపురి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మర్రి కృష్ణ, లకావత్ రమేష్, మాటేటి వెంకట్, మాధవరావు, కార్తీక్, త్రిమాత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కళాపరిషత్ కమిటీ సభ్యులు

పాల్వంచరూరల్: పాల్వంచ కళాపరిషత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉగాది సంబరాల వాల్‌పోస్టర్లను ఆదివారం స్థానిక పట్టణంలోని గణేష్ సాయి ఫంక్షన్ హాల్‌లో కొత్త వెంకటేశ్వర్లు, డాక్టర్ బిక్కసాని సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాల్వంచ కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి వేముల కొండలరావు మాట్లాడారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మంతపురి రాజ్‌గౌడ్, డాక్టర్ బుచ్చయ్య, మహిపతి రామలింగం, చలవాది ప్రకాశ్, గొర్రెపాటి రమేష్, టి.లింగమూర్తి, ముగిది శ్రీనివాస్, బోను లక్ష్మీనారాయణ, సందీప్ పాల్గొన్నారు.